# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శుక్రవారం 21 మార్చి 2025 | HYDERABAD




ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు, నిరసనలు చేయవద్దంటూ.. అధికారులు ఇచ్చిన సర్క్యులర్ పై నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. వర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థి నేతలు టెక్నాలజీ కళాశాల నుంచి పరిపాలనా భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. సర్క్యులర్ పత్రాలను చింపివేసి..తమ నిరసన తెలిపారు. - ఉస్మానియా యూనివర్సిటీ



నిరసన తెలుపుతున్న ఊబర్, ఓలా క్యాబ్ డ్రైవర్లు

## అన్ని వర్గాలను విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

దుండిగల్: మరో మూడున్నర సంవత్సరాల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం చేపట్టడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గాజులరామారం సర్కిల్ పరిధి, సూరారం డివిజన్, షాపూర్‌నగర్‌లోని ఎంజే గార్డెన్స్‌లో బీఆర్ఎస్ విప్, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. మరో మూడేండ్ల తర్వాత కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



షాపూర్‌నగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు

## రైడ్‌కు తగ్గ ధరలు నిర్ణయించండి

### ప్రభుత్వమే యాప్ తీసుకురావాలి

సిటీబ్యూరో/శామీర్‌పేట, మార్చి 20 : ఇతర రాష్ట్రాల వాహనాలు తెలంగాణలో నిబంధనలకు విరుద్ధంగా ట్రిప్పులు కొడుతూ తమ ఉపాధిని దెబ్బతీస్తున్నాయని క్యాబ్ డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓలా, ఉబర్, ర్యాపిడో యాప్‌లు కమీషన్లు ఎక్కువగా తీసుకొని తమకు తక్కువ చార్జీలు చెల్లిస్తున్నదని క్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ చెప్పారు. అందులో భాగంగా యాప్‌లను బహిష్కరించామన్నారు. 57వేల మంది క్యాబ్‌డ్రైవర్లు నిరసనలో పాల్గొన్నారని వివరించారు. ఎయిర్‌పోర్ట్ ట్రిప్స్ బహిష్కరించినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్ తీసుకొస్తామని మాటిచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని చెప్పారు. ఆర్టీఏ అధికారుల అనుమతి లేకుండా ఐటీ కంపెనీల్లో అక్రమంగా ప్రజా రవాణా చేస్తున్న ఇతర రాష్ట్ర వాహనాలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు తగిన ధరలు నిర్ణయించే వరకు ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులు బహిష్కరిస్తామని చెప్పారు. ఊబర్..ఓలా క్యాబ్ డ్రైవర్లకు చెల్లిస్తున్న ధరను పెంచి తమను ఆర్థికంగా ఆదుకోవాలని ఊబర్, ఓలా క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్ యాజమాన్యాల తీరుకు నిరసనగా తూంకుంట మున్సిపల్ దొంగలమైసమ్మ-శామీర్‌పేట ఓఆర్ఆర్ సర్కిల్ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఊబర్, ఓలా క్యాబ్ డ్రైవర్స్ వేణు గోపాల్, శ్రవణ్ కుమార్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ గందరగోళం

- అస్తవ్యస్తంగా దరఖాస్తుల ప్రక్రియ
- రాయితీ గడువు తేదీ ముంచుకొస్తున్నా.. కార్యాలయాలు దాటని యంత్రాంగం
- తలనొప్పిగా మారిన టెక్నికల్ సమస్యలు
- ఫీజు ఇంటిమేషన్ వస్తున్నా.. పేమెంట్‌కు సహకరించని వెబ్‌సైట్

సిటీబ్యూరో: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం మాయ ప్రపంచాన్ని తలపిస్తోంది. తమ ప్లాట్లు క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు దొరికిందనీ ఆశపడిన ఎంతో మంది దరఖాస్తుదారులు ఇప్పుడు చుక్కలు చూస్తున్నారు. ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతించడంతో సంతోషపడిన జనాలే ఇప్పుడు... ఆందోళన చెందుతున్నారు. కనీసం ప్రభుత్వం 25 శాతం రాయితీతో దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా.. జనాలు ఫీజులు ముందుకు రావడం లేదు. దీనికి వెబ్‌సైట్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలే కారణం కాగా, దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించేందుకు ముందు రావడం లేదు. ఈ మాయ ప్రపంచంలో అడుగు పెట్టడం కంటే దరఖాస్తులపై స్పందించకపోవడమే ఉత్తమమనే భావన జనాల్లో వ్యక్తమవుతున్నది.



### సగానికి కంటే ఎక్కువ ఫీజులు..

ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంపై ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు అమలు చేస్తున్న విధానాలు, ఆన్‌లైన్‌లో చూపుతున్న ప్రాసెస్ అంత గందరగోళంగా ఉంది. హెచ్ఎండీఏ పరిధిలో మూడున్నర లక్షలకు పైగా ప్లాట్లను క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 30 శాతం దరఖాస్తులు క్రమబద్ధీకరణ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తొలి దశలోనే తిరస్కరించారు. మిగిలిన 2.75 లక్షల దరఖాస్తుల్లో సగానికి కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాలని నోటీఫికేషన్ జారీ చేశారు. మిగిలిన వాటిలో ఇప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఎదురు చూస్తుండగా, ఫీజులు చెల్లించాలని నోటిఫికేషన్లు అందుకున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఫీజులు చెల్లించేందుకు ఇంటి నుంచే వెసులుబాటు కలిగిస్తూ ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినా... అందులో తలెత్తున్న టెక్నికల్ సమస్యలు దరఖాస్తుదారుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఫీజు పేమెంట్ మోడ్‌లోకి వెళ్లగానే ఒక్కసారిగా ప్రక్రియ నిలిచిపోవడం, లేదా ఇంటర్‌నెట్ బ్యాంకింగ్/యూపీఐ వివరాలను నమోదు చేసిన వెంటనే ఆగిపోవడం వంటి సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులపై కొన్ని పరిమితులు ఉండటంతో... ఎల్ఆర్ఎస్ చెల్లింపుల ప్రక్రియ మాయజాలాన్ని తలపిస్తోందని, తాను ఎదుర్కొన్న ఇబ్బందులపై తెలుసకునేందుకు హెచ్ఎండీఏ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తున్నదని పటాన్‌చెరుకు చెందిన ఓ దరఖాస్తుదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు చెల్లిస్తే తన ఖాతా నుంచి బదిలీ కాకుండా మొరాయిస్తుందని, కానీ తన ఖాతాలో అమౌంట్ బదిలీ చేసినట్లు సమాచారం రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

### తరచూ సాంకేతిక సమస్యలు..

రాష్ట్రవ్యాప్తంగా 25.4లక్షల ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇటీవల ఆ వెబ్‌సైట్‌లో కొన్ని మార్పులు చేయడంతోనే ఇబ్బందులు వస్తున్నట్లు పలువురు అధికారులు వాపోతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల మధ్య సమాచార మార్పిడి జరిగే క్రమంలో టెక్నికల్ సమస్యలు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ ఇచ్చినా.. ప్రయోజనం లేదని, నిత్యం యాప్‌లో వచ్చే సమస్యలతో ప్రక్రియ సజావుగా సాగడం లేదని చెబుతున్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఓ వ్యక్తి

## తులం బంగారం ఇస్తలేరు

### ఎమ్మెల్యే తలసానితో ఓ లబ్ధిదారు ఆవేదన

బేగంపేట, మార్చి 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉన్నదని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం సికింద్రాబాద్ లోని తహసీల్దార్ కార్యాలయంలో 69 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే కాంగ్రెస్ ప్రభు త్వం బడ్జెట్‌లో పొందుపర్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు గత బడ్జెట్‌లో కూడా ప్రకటించారని, ఎక్కడ ఇచ్చారో చూపిస్తారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, కుర్మ హేమలత పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి.. 15 నెలలు గడుస్తున్నా.. స్పందించడం లేదని ఓ లబ్ధిదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

GHMC

## ఆస్తి పన్ను వసూలు కోసం వారెంట్లు జారీ

అబిడ్స్, మార్చి 20 : జీహెచ్ ఎంసీ 14వ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఆస్తి పన్ను బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు వారెంట్లను జారీ చేస్తున్నారు. మొత్తం టార్గెట్ 93 కోట్లు ఉండగా ఇప్పటివరకు 55 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. అయితే ఆస్తి పన్ను ఎక్కువగా బకాయి పడిన 112 మందికి వారెంట్లను జారీ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ లావణ్య తెలిపారు. వారెంట్లు జారీ చేసినా స్పందించని 62 ఆస్తులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

### సిటీ సెంటర్ మాల్ బకాయి రూ.2 కోట్లు

**ఖైరతాబాద్:** ఆస్థి పన్నుల ఎగవేతదారులపై జీహెచ్‌ఎంసీ కఠినంగా వ్యవహరిస్తోంది. సంవత్సరాల తరబడి పన్ను చెల్లించకుండా ఎగవేసిన ఓ భవనాన్ని సీజ్ చేసేందుకు యత్నించగా, సాయంత్రం వరకు ఉత్కంఠ కొనసాగింది. ఎట్టకేలకు చెల్లించడంతో అధికారులు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే సర్కిల్ 18 పరిధిలోని బజారాహిల్స్ రోడ్ నం.1లో హెచ్ఎఫ్సీ బ్యాంకు ఉన్న భవనానికి భారీగా పన్నులు పెండింగ్ ఉండడంతో రెడ్ నోటీసులు, వారెంట్లు సైతం జారీ చేసినా బేఖాతరు చేశారు. దీంతో గురువారం అధికారుల బృందం ఆ భవనాన్ని సీజ్‌చేసేందుకు వెళ్లింది. అధికారులు వెంటనే చెల్లించాల్సిందిగా కోరగా, కట్టేందుకు కొంత వెనకడుగు వేయడంతో ఉత్కంఠ నెలకొంది. సాయంత్రం ఎట్టకేలకు యజమాని రూ.43,83,901 ఆస్తి పన్ను బకాయిలను చెల్లించడంతో వెనుకదిరిగారు. అలాగే బంజారాహిల్స్ సిటీ సెంటర్ మాల్ సైతం రూ.2కోట్ల వరకు ఆస్తి పన్ను పెండింగ్‌లో ఉందని, సకాలంలో చెల్లించకుండా ఆ మాల్‌ను సైతం సీజ్ చేస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు.

### బడంగ్‌పేట వెనుకంజ

**బడంగ్ పేట:** బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నుల వసూలు జాప్యంపై అధికారులకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రాపర్టీ టాక్స్ డిమాండ్‌కు అనుగుణంగా పన్ను వసూలు చేయలేదని సీడీఎంఏ బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌ను అనేకసార్లు మందలించినట్లు సమాచారం. గత సంవత్సరం రూ. 25 కోట్ల డిమాండ్ ఉండగా 18.62 కోట్లు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేశారు. ఈ సంవత్సరం 39.52 కోట్ల డిమాండ్ ఉండగా, 14.52 కోట్లు మాత్రమే వసూలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇక మిగిలిన ఎనిమిది రోజుల్లో అధికారులు 100 శాతం పన్ను వసూలు చేసే పరిస్థితి లేదు.

## ఎల్బీనగర్‌లో కాంగ్రెస్-బీజేపీ ఒక్కటయ్యాయి



మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు

### బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ల ధ్వజం

వనస్థలిపురం, మార్చి 20: బీజేపీ, కాంగ్రెస్‌లతో దేశమంతా ఒక విధానం ఎల్బీనగర్‌లో ఒక విధానంగా ఉందని బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జివి సాగర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, పద్మానాయక్ అన్నారు. గురువారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ నేత మధుయాష్కి సలహాలతో బీజేపీ కార్పొరేటర్లు పనిచేస్తున్నారన్నారు. నియోజకవర్గానికి వస్తున్న 80 శాతం నిధులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంజూరు చేయించినవే అన్నారు. ఎన్జీవోస్ కాలనీలోని లైబ్రరీ గ్రౌండ్‌ను ఉన్నతంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే చూస్తుంటే బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మధుయాష్కి చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. చంపాపేట కార్పొరేటర్ ఓ ఫంక్షన్ హాల్ కోసం మధుయాష్కి ఇంటి చుట్టూ తిరిగారన్నారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు కార్పొరేటర్లు అందరూ కలిసి వస్తున్నారని, ముగ్గురు మాత్రం కావాలనే రాజకీయం చేస్తూ, ప్రారంభమైన పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. అభివృద్ధికోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యేపై బురదజల్లేందుకు కుట్రలు చేయడం తగదన్నారు.



## వర్ష సూచన

సిటీబ్యూరో: ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజుల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తెలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి.

## సీఎంకు వినతి



మల్కాజిగిరి నియోజకవర్గంలో సీఆర్ఎంపీ, జీహెచ్ఎంసీ రోడ్లతో పాటు అదనంగా మిలటరీ ఏరియాలో రహదారులు వేయాలని కోరుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి - మల్కాజిగిరి

# దవాఖానల వద్దే అమ్మకం!

## పేదరికంతోనే పిల్లల విక్రయం


### మెడికల్ ఫీల్డ్‌లో ఉన్నవాళ్లే కీలకం

### సోషల్ మీడియాతోనే అంతర్రాష్ట్ర ముఠాలకు లింక్

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): పసిపిల్లలను అక్రమ విక్రయాలకు దవాఖానాలలో పనిచేసే వారి వద్ద నుంచే నాంది పలుకుతుంది. పేదరికాన్ని ఆసరాగా చేసుకుని పిల్లలను విక్రయించే వాళ్లను ఎంపిక చేస్తున్నారు. రాష్ట్రాలు, ప్రధాన పట్టణాలలో పిల్లల విక్రయానికి సంబంధించిన ముఠాలకు సోషల్ మీడియానే వేదికవుతుంది. అమ్మేవారికి, కొనే ముఠాలను సోషల్‌మీడియాలలోనే ఎక్కువగా పరిచయాలు అవుతున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ఏడాది కాలంలో రాచకొండ పోలీసులు అంతరాష్ట్ర పిల్లల విక్రయాలకు సంబంధించిన ఆరు ముఠాల లింక్‌లను ఛేదించారు. గత ఏడాది మేడిపల్లిలో ఢిల్లీకి సంబంధించిన నెట్‌వర్క్‌ను ఛేదించగా తాజాగా మల్కాజిగిరి ఎస్‌ఓటీ, చైతన్యపురి పోలీసులు సుమారు పది రాష్ట్రాలతో ముడిపడి ఉన్న ఐదు నెట్‌వర్క్‌లకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. పిల్లలు కావాల్సిన వాళ్లు, పిల్లలను విక్రయించే వాళ్లను గుర్తించడంలో దవాఖానాలలో పనిచేసే వారైతేనే ఈజీగా ఉంటుందని ఆయా ముఠాలు భావిస్తూ మెడికల్ ఫీల్డ్‌తో టచ్‌లో ఉన్న వారిని తమ గ్యాంగ్‌లో కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారు.

### సోషల్ మీడియా కలిపేస్తోంది!

సాధారణంగా ఒక ప్రాంతంలో పనిచేసే వారు ఆ ప్రాంతంలోనే తమ పనులు సాగిస్తుంటారు. సోషల్‌మీడియాలోకి వెళ్లే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నెట్‌వర్కులతో పరిచయాలు ఏర్పడుతాయి. రాచకొండ పోలీసులకు పట్టుబడ్డ గ్యాంగ్‌లలో హైదరాబాద్, ఏపీ, గుజరాత్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, యూపీ, కర్ణాటక, కేరళ, ఢిల్లీకి సంబంధించిన లింక్‌లు బయటపడ్డాయి. హైదరాబాద్‌లో ఆశ వర్కర్‌గా పనిచేసే అమూల్య, మలక్‌పేట్ ఏరియా దవాఖానాలో పనిచేసే ఇస్మాయిల్‌తో స్థానికంగా పిల్లలను విక్రయించారు. ఆ తరువాత గుజరాత్‌కు చెందిన వందన , దీప్తి నెట్‌వర్క్‌తో అమూల్యకు పరిచయం కావడంతో కొన్ని రోజులు వారితో కలిసి పిల్లల విక్రయాలను సాగించింది. ఆ తరువాత తానే స్వయంగా సోషల్‌మీడియాలో తన నెట్‌వర్క్‌ను పెంచుకుంది. అలాగే దీప్తి సైతం తన సొంతంగా నెట్‌వర్క్‌ను తయారు చేసుకుంది. ఇలా ఒకో పసిపిల్లల విక్రయం వద్ద రూ. 3 నుంచి 4 లక్షల లాభాలు వస్తుండడంతో దీనిని ఈ ముఠాలు వ్యాపారంగా కొనసాగిస్తున్నాయి.



### అమ్మకానికే!

యూపీ, గుజరాత్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలలో పిల్లలను విక్రయించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఒక రాష్ట్రంలో పుట్టిన పిల్లలను మరో రాష్ట్రంలో విక్రయించడం వల్ల ఎవరికి ఎలాంటి అనుమానాలు ఉండవని ఈ ముఠాలు భావిస్తున్నాయి. దీంతో పేదరికంతో ఉన్న వారిని ఎంచుకొని వారు ఎప్పుడు కాన్పు అవుతున్నారు, వారికి పుట్టబోయే బిడ్డను ఒకటి రెండు రోజుల్లోనే తమకు అప్పగించాలని ముందుగానే అడ్వాన్స్‌లు కూడా ఇస్తున్నట్లు తెలిసింది. ఇందులో కొందరు పిల్లలను పెంచడానికి స్థోమత లేక, మరికొందరు డబ్బు కోసం పుట్టిన బిడ్డలను అమ్ముకుంటున్నట్లు పోలీసులు విచారణలో బయటపడింది. ఇక్కడ రిస్క్యూ చేసిన పిల్లలను తమ అసలు తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు పోలీసులు ప్రయత్నించినా అసలు తల్లిదండ్రులు ఎవరు ముందుకు రావడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు. దీంతో కొందరు పిల్లలను విక్రయించే తల్లిదండ్రులు కూడా తమ చిరునామా తెలియకుండానే జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ఈ ముఠాల చేతిలో చిక్కి పిల్లలు కావాల్సిన వారు వారికి లక్షలు ఇచ్చి కొనుగోలు చేస్తూ చివరకు నేరస్థులుగా మారుతున్నారు. అందుకే చట్టబద్ధంగా పిల్లలను దత్తతకు తీసుకోవాలని పోలీసులు సూచనలు చేస్తున్నారు.